
ప్రజాశక్తి
శనివారం 4 మార్చి 2023 5
పార్వతీపురం మన్యం



రిసెప్షన్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

శాసన మండలి పట్టభద్రుల ఎన్నికలకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 12న ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయనున్న దృష్ట్యా బ్యాలెట్ బాక్స్‌లు, పేపర్లు, స్టేషనరీ సామాగ్రిని పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను డిఆర్ఒ జె.వెంకటరావుకు సూచనలు చేశారు. అక్కడ నుంచి బ్యాలెట్ బాక్స్ లు భద్రపరిచే తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.



అనాథ @ రెవెన్యూ కార్యాలయం

- దీర్ఘకాలిక సెలవులో తహశీల్దార్
- ఆర్ఐ సంతోష్‌కు అస్వస్థత
- కిందిస్థాయి సిబ్బందే దిక్కు
- డిప్యూటీ సిఎం ఇలాకాలో గాడి తప్పిన రెవెన్యూ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం దిక్కూ మొక్కూ లేని అనాథలా తయారైంది. కీలకమైన అధికారులు సెలవులో ఉండడంతో ఈ కార్యాలయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నెలరోజులుగా మండల తహశీల్దార్ వి.రామస్వామి సెలవులో ఉన్నారు. అనారోగ్యం కారణంగా ఆయన దీర్ఘకాలం సెలవు పెట్టారు. ఎప్పుడు విధుల్లో చేరుతారో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. కార్యాలయం అధికారిగా కొద్దో గొప్పో రెవెన్యూ కార్యకలాపాలపై పట్టు కొంత వరకు ఆయనకే ఉంది. మిగిలిన అధికారులకు రెవెన్యూ పరిజ్ఞానం పెద్దగా లేదనే ప్రచారం జరుగుతోంది. తహశీల్దార్ సెలవు పెట్టి నెలదాటిపోయింది. ఎప్పుడు విధుల్లో చేరుతారో సిబ్బందికే తెలియని పరిస్థితి. గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. నెలరోజులుగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాధ్యతలు నిర్వహిస్తున్న భానుప్రసాద్‌కు కూడా పెద్దగా రెవెన్యూ పరిజ్ఞానం లేకపోవడంతో ఆయన కింద స్థాయి సిబ్బందిపై ఆధారపడుతున్నారు. ఎన్నికల డిటి, సివిల్ సప్లయ్ డిటిలు ఇద్దరికీ వారి సబ్జెక్టు తప్ప రెవెన్యూ పరిజ్ఞానం తక్కువే. దీని వల్ల కార్యాలయంలో కిందిస్థాయి సిబ్బందే కింగ్ మేకర్ లుగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత మండల తహశీల్దార్ కార్యాలయం ఇలాంటి అయోమయ పరిస్థితికి ఎప్పుడూ చేరలేదు. ఏజెన్సీ, అర్బన్, రూరల్ మండలాలకు చెందిన ప్రజలతో కార్యాలయం నిత్యం కిటకిటలాడుతుంది. రకరకాల భూసమస్యలు, లిటిగేషన్‌లు, వివాదాలకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతంలో రెవెన్యూ పరిజ్ఞానం బాగా ఉన్న అధికారిని తహశీల్దార్‌గా నియమించాల్సి ఉంటుంది. కానీ రెవెన్యూ అవగాహన లేని అధికారులు, సిబ్బందిని ఇక్కడకు బదిలీ చేయడంతో కార్యాలయం పరిస్థితి చుక్కాని లేని నావలా మారింది. గతంలో కొద్దినెలల పాటు ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు హయాంలో గాడి తప్పిన రెవెన్యూ కార్యాలయం కొంత గాడిలో పడినట్లు కనిపించింది. ఆయన బదిలీ కావడం, తహశీల్దార్ రామస్వామి సెలవులో ఉండడంతో కార్యాలయంలో జవాబుదారీతనం కొరవడిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

డిప్యూటీ సిఎం ఇలాకాలో ఇదేం కర్మ

నియోజకవర్గ కేంద్రంలో చురుగ్గా పని చేసే సామర్థ్యం, రెవెన్యూ పరిజ్ఞానంపై పట్టున్న అధికారిని తహశీల్దార్‌గా నియమిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించే అవకాశం ఉంటుంది. కానీ అందుకు భిన్నమైన పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయి. డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా గాడి తప్పుతున్న రెవెన్యూపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ పరిజ్ఞానం, పని సామర్థ్యం కలిగిన అధికారిని ఇక్కడ తహశీల్దార్‌గా నియమించుకునే ప్రయత్నం ఆయన చేయడం లేదు. దీంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గ కేంద్రాల్లోనూ, వాటి పరిధిలోని మండలకేంద్రాల్లో సమర్థులైన అధికారులను నియమింపజేసుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు పావులు కదుపుతున్నారు. కానీ ఇక్కడ విషయంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న రెవిన్యూ సమస్యలు మూడడుగుల ముందుకు, ఆరడుగుల వెనక్కి అన్న చందంగా మిగిలిపోతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాకు బాస్ అయిన రాజన్నదొర ఉండి కూడా నియోజకవర్గ కేంద్రంలో ఇదేం కర్మ అని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పక్కాగా వైద్య సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వాసుపత్రుల పరిధిలో పక్కాగా వైద్య సేవలందించడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సి, పిహెచ్‌సి వైద్యులు, అధికారులతో వైద్య సేవలు, ఆరోగ్య పథకాల అమలు ప్రగతిపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణీ, శిశువుల వైద్య పరీక్షలు, వివరాల నమోదు పూర్తి స్థాయిలో పక్కాగా నిర్వహించాలని అన్నారు. ఎనీమియా ముక్తభారత్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించి ఫలితాలను అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. ఎన్‌సిడి, సిడి సర్వేలో భాగంగా బిపి, సుగర్‌తో పాటు దీర్ఘ కాలిక రోగాలు, జ్వరాలు, మలేరియా తదితర వివరాలు సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో భాగంగా హెల్త్ కార్డుల జారీకి ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి మాతృత్వవందన యోజన పథకం కింద ప్రసవం అనంతరం అందిస్తున్న మొత్తాన్ని సకాలంలో చెల్లించాలని అన్నారు. జననీ సురక్ష యోజన కింద ప్రసవాల అనంతరం మొత్తాన్ని అందజేయాలని, బ్యాంకు మిస్సింగ్ వివరాలను ఎఎన్ఎం, ఆశా వర్కర్ల సహాయంతో శత శాతం నమోదు చేయలని సూచించారు. శిశువులకు, చంటి పిల్లలకు సంబంధించి టీకా నిర్వహణ వివరాలను ఆన్ లైన్‌లో అప్లోడ్ 95 శాతం పైబడి ఉండాలన్నారు. నాడు - నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న పిహెచ్‌సిల పనులు త్వరితగతిన జరగాలని, లక్ష్య కాయ కల్ప సర్టిఫికెట్లు పొందేందుకు పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు ప్రసన్న కుమార్, సిమ్మన్నను ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు నమోదు శత శాతం అయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని డిఎంహెచ్ఒ బి.జగన్నాధంకు సూచించారు. సమావేశంలో డిహెచ్‌సిఒబి.వాగ్దేవి, ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ డి.భాస్కరరావు, సీతంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒలు జివి రమణ, కె.విజయపార్వతి, డిఐఒ టి.జగన్మోహనరావు, డిఎల్ఒ ఎ.శ్యామ్‌కుమార్, ఆర్అండ్‌బి ఇఇ ఎం.జేమ్స్, ప్రోగ్రాం అధికారులు ఎం.నవీన్‌కుమార్, ఎం.వినోద్, పాలకొండ, సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు ఎం.శ్రీనివాసరావు, ఎ.నాగభూషణరావు, వైద్యులు, తదితరులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆనంద్

ఆర్‌ఆర్ పనులు వేగవంతం : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

తోటపల్లి ప్రాజెక్ట్ నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కాలనీల్లోని పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ ఆర్ పనులపై రెవెన్యూ, కార్యనిర్వహణశాఖలతో పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీల్లో మంజూరైన మౌలిక వసతులు, సదుపాయాల కల్పనకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జియ్యమ్మ వలస మండలం బాసంగి పునరావాస కాలనీలో పాఠశాల భవనం, అంగన్వాడీ కేంద్రం అంచనాలను అందజేయాలని ఆర్‌డిఒ కె.హేమలతను ఆదేశించారు. అలాగే బంటువాని వలస, గిజబ గ్రామాల అర్హులైన లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన పనుల బిల్లులు చెల్లింపునకు మ్యాపింగ్ జరిపి సిఎఫ్ఎంఎస్‌లో అప్ లోడ్ చేయాలని తోటపల్లి ప్రాజెక్ట్ కార్యనిర్వహక ఇంజనీరింగ్ అధికారి జి.రామచంద్రరావును ఆదేశించారు. ముంపు గ్రామాల దేవాలయాల పునర్నిర్మాణానికి అంచనాలను అందజేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి శాంతేశ్వరరావు ఆదేశించారు. పునరావాస కాలనీల్లో మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఎక్కడైనా సమస్యలుంటే తక్షణం పరిష్కారానికి ఆర్డీవో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి సుధారాణి, ఆర్ అండ్ బి, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారులు ఎం.జేమ్స్, ఒ.ప్రభాకర రావు, పార్వతీపురం, కొమరాడ, జియ్యమ్మ వలస తహశీల్దార్లు టివి రమణ, రాధాకృష్ణ, డివి సీతారాములు, హౌసింగ్ డిఇ డి.మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ గెలుపుతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-డెంకాడ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించడం ద్వారా ఉత్తరాంధ్ర వాణిని శాసనమండలిలో వినిపించి అభివృద్ధికి బాటలు వేయవచ్చునని ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. రమాప్రభను గెలిపించాలని కోరుతూ శుక్రవారం రఘు ఇంజినీరింగ్ కాలేజీలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, ప్రొఫెసర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పిడిఎఫ్ గెలుపు..ఉత్తరాంధ్రకు మలుపు వంటిదని, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం శాసనమండలి వేదికగా కృషి చేసేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ రంగు పులుముకోవడం శోచనీయమని అన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని గతంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బందికి ఒక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులను, హెల్త్ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కదిలించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ బి.గంగారావు, కె.సురేష్, సిహెచ్. వెంకటేష్, రామకష్ణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వైవి

పార్వతీపురం టౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టణంలో ప్రజాసంఘాల నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, కార్మికసంఘాల సభ్యులు ప్రధాన రహదారిలో పట్టభద్రులను కలిసి కరపత్రాలను అందించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా గొంతు వినిపించేందుకు కోరెడ్ల రమాప్రభను శాసనమండలికి పంపించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు.



బలిజిపేటలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బలిజిపేట : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపునకు మండలంలోని ప్రజాసంఘాల నాయకులు వై.మన్మధరావు, గేదెల సత్యనారాయణ శుక్రవారం వేకువ జామున నుంచే విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమరాడ, వెంగాపురంలో ప్రచారం నిర్వహించారు. ఓటరు వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో ఈ ప్రసారాన్ని కొనసాగించారు.

కొమరాడ : పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోట రమేష్, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి స్థానిక బాలుర గురుకుల పాఠశాల, ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాల, బ్రిడ్జి స్కూల్, కస్తూరిబా స్కూలు, గిరిజన బాలికల ఆశ్రమం పాఠశాల, ఖేర్జలలో గల బాలికల ఆశ్రమం పాఠశాల, సచివాలయం, గుమడ సచివాలయం పరిధిలో ప్రచారం నిర్వహించారు. కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను, సచివాలయం ఉద్యోగులను కోరారు.

నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి రూ.10 లక్షలకు మించి నగదు లావాదేవీలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఆర్ఒ జె.వెంకటరావు అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఆదాయ పన్నుల, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు రూ.10 లక్షలకు మించి పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరిపిన వారి వివరాలను బ్యాంక్ అధికారుల నుంచి బాబితా సేకరించి విచారణ జరపాలన్నారు. అలాగే తక్కువ నగదు రూపంలో ఎక్కువ సార్లు లావాదేవీలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్ కం టాక్స్ అధికారులు కె. రవిశంకర్, జి.రమణ, కలెక్టరేట్ ఎఒ ఉమా మహశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

న్యాయవాది ఇంటికి బాలల హక్కుల కమిషన్

ప్రజాశక్తి-విజయనగరం

భార్యను ఏళ్ల తరబడి బంధించిన న్యాయవాది మధుబాబుపైనా, తన కుమారుడిని అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన సోదరుడు దుర్గాప్రసాద్‌పైనా వారి భార్యలు పోలీసులకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి.హిమబిందు కంటోన్మెంట్‌లోని వారి ఇంటిని శుక్రవారం పరిశీలించారు. జరిగిన ఘటనలపై ఆరా తీశారు. ఇంట్లో ఉంటున్న పిల్లలతోను, వారి నాన్నమ్మతోను మాట్లాడి వారి సంరక్షణపై తీసుకుంటున్న చర్యలు గురించి చర్చించారు. పిల్లలను తల్లికి దూరం చేయొద్దని సూచించారు. ముగ్గురు పిల్లలకు, నాన్నమ్మ ఉమాదేవికి కూడా సిబ్బంది కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులతో పిల్లలను విడదీయరాదని, వారి రక్షణ, సంరక్షణ లోనే ఉండాలని అన్నారు. పాఠశాలకు పంపిస్తూ చదువుకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. వారితో పాటు జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు భవాని, సుధారాణి పట్నాయక్, బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ, సిబ్బంది యాల్ల నాగరాజు, సంధ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి డిఎం మహేంద్రకుమార్

కిలో చింతపండు రూ.32.40

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది చింత పండు కొనుగోలులో అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలని జిసిసి సిబ్బందిని పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ అన్నారు. స్థానిక జిసిసి బ్రాంచి కార్యాలయంలో సిసిపిఎలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన రూ.32.40పైసలు చొప్పున గిరిజనుల నుంచి పూర్తిస్థాయిలో చింతపండు కొనుగోలు చేయాలన్నారు. చింతపండు కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. తమ పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద గిరిజనులు సేకరించి తీసుకొచ్చిన చింతపండుతో పాటు మిగిలిన అటవీ ఉత్పత్తులను కూడా కొనుగోలు చేసి ఇటు జిసిసికి అటు గిరిజనులకు ఆర్థిక అభివృద్ధి చేకూరేలా ఉద్యోగులు పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక బ్రాంచి మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, గోదాము సూపరిండెంట్ సాంబమూర్తి తదితరులు ఉన్నారు.

'ఫైర్ అండ్ సేఫ్టీ'పై వర్క్‌షాప్

విజయనగరం : సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ఫైర్ అండ్ సేఫ్టీ కార్యశాల' శుక్రవారం నిర్వహించారు. దీని ప్రాముఖ్యతను సన్ రైజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజినీర్స్ డైరెక్టర్, శిక్షకుడు జి. భాస్కర్ రావు విద్యార్థులకు వివరించారు. దేశ విదేశాల లో సేఫ్టీ ఇంజినీర్స్ కోర్స్ చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ కోర్సుపై అవగాహన పెంచుకుంటూ విద్యతో పాటు గా ఇటువంటి సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, మెకానికల్ విభాగాధిపతి సిహెచ్ వెంకట లక్ష్మి, మెకానికల్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

డబ్బులిచ్చుకో... ఇల్లు కట్టుకో

- అమ్మిగారి కోనేరుగట్టుపై అక్రమ నిర్మాణాలు
- ఆక్రమణలపై వైసిపి కౌన్సిలర్ల అభ్యంతరం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో మున్సిపల్ అనుమతులు లేకుండా ఎటువంటి నిర్మాణాలూ చేపట్టకూడదు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. కానీ పట్టాలు లేకపోయినా, అనుమతులు రాకపోయినా అమ్మిగారి కోనేరుగట్టుపై నిర్మాణాలు చేయాలంటే అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ చేతులు తడపాల్సిందే. చెరువుగట్లపై ఎటువంటి నిర్మాణాలూ చేపట్టకూడదని వాల్టా చట్టం చెపుతున్నా బొబ్బిలి మున్సిపాలిటీలో అమలు కావడం లేదు. అమ్మిగారి కోనేరు గట్టును కొంతమంది ఆక్రమించేసి అధికార పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్‌కు ఆమ్యామ్యాలు చెల్లించి, గట్టుపై అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో అమ్మిగారి కోనేరు ఉంది. కోనేరు చుట్టూ గట్టు ఆక్రమణకు గురైంది. గతంలో ఆక్రమణ స్థలంలో రేకిళ్లు, పూరిళ్లు నిర్మించుకుని జీవనం సాగించే వారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గట్టుపై ఆక్రమణదారులు నుంచి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ అక్రమ వసూళ్లకు పాల్పడి పక్కా భవనాలు నిర్మించుకోవాలని చెప్పడంతో ఆక్రమణ దారులు ఫిల్లర్లు వేసి భవనాలు నిర్మించుకుం టున్నారు.

తాత్కాలికంగా బ్రేక్

కోనేరుగట్టుపై ఇళ్లు నిర్మిస్తున్న ఆక్రమణదారుల నుంచి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కోనేరుగట్టు ఆక్రమణదారులకు ఇళ్ల పట్టాలు లేదా పొజిషన్ పట్టాలు ఇప్పిస్తామని చెప్పి ఒక కౌన్సిలర్ డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. గట్టుపై ఉన్నవారికి పట్టాలు లేదా పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేసినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఏమి చేయాలో తెలియక ఆక్రమణ స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే, మున్సిపల్, రెవెన్యూ అధికారుల నుంచి అభ్యంతరం రాకుండా చూసుకుంటామని కౌన్సిలర్ చెప్పడంతో గట్టుపై ఫిల్లర్లతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. గట్టుపై అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో కొంతమంది వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. కోనేరు గట్టుపై ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో అక్రమ నిర్మాణాలు నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కోనేరు గట్టుపై అక్రమ నిర్మాణాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.



ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - పాచిపెంట

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ వద్ద గృహనిర్మాణశాఖ అధికారులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఇళ్ల నిర్మాణాల పరిస్థితి గురించి స్థానిక ఎంపిడిఒ లక్ష్మీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 680 ఇళ్లు పూర్తయ్యాయని, ఇంకా 300 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉందన్నారు. వివిధ నిర్మాణ దశలైన ఆర్ఎల్ 235, ఆర్‌సి 30 ఇళ్లు ఉన్నాయని వివరించారు. ఉగాదికి పూర్తిస్థాయి నిర్మాణాలు జరగాలని ఎంపిడిఒను, హౌసింగ్ డిఇని ఆదేశించారు. సమీక్ష అనంతరం స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సంబంధిత రికార్డులను పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తున్నారా, లేదా అని పాఠశాల మేట్రిన్ స్వర్ణలతను ప్రశ్నించారు. గణితానికి సంబంధించిన పరీక్ష పేపరును పిఒ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. భోజనాల నాణ్యత, సరిపడా ఆహారం అందిస్తున్నదీ, లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల తాగునీటి సమస్య ఉందని, బోరు ఏర్పాటు చేయాలని మేట్రిన్ పిఒను కోరారు. ఆయన వెంట పలువురు మండల అధికారులు ఉన్నారు.

5న చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

విజయనగరం టౌన్ : కృష్ణా, అనకాపల్లిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఈనెల 5న ఎంపికలు జరుగుతాయని చెస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ పోటీలు రింగ్‌రోడ్డులోని ఫైర్ చెస్ స్కూల్‌లో జరుగుతాయని తెలిపారు. అండర్-7 క్రీడాకారులు 2018 జనవరి 1, అండర్-17 క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా తమ జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని తెలిపారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ

విద్యా వనరుల కేంద్రంలో డిఇఒ తనిఖీ

సీతానగరం : స్థానిక మండలం విద్యా వనరుల కేంద్రం వద్ద గల సాహితీ విద్యా వనరుల కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సాహితీ విద్యా ఉపాధ్యాయుల హాజరు, వికలాంగ విద్యార్థుల హాజరు పట్టిక, క్యాంపుల నిర్వహణ కోసం నిర్వహించిన రికార్డులు, ఫిజియోథెరపీ క్యాంపుల నిర్వహణ ఉంటే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యుత్‌తో పాటు ఫిజియోథెరపీ చేయడం ద్వారా వికలాంగులకు ఉపయోగపడుతుందని అన్నారు. పరిసరాల శుభ్రతను కూడా పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎంఇఒ ఎం.సూరిదేవుడు, ఉపాధ్యాయులు ఎం.కృష్ణమోహన్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.


కుళాయిలకు బిగించిన ట్యాప్‌లు

కుళాయిలకు ట్యాప్‌ల ఏర్పాటు
ప్రజాశక్తి వార్తకు స్పందన

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో కుళాయి పాయింట్లకు పంచాయతీ అధికారులు ట్యాప్‌లను శుక్రవారం ఏర్పాటు చేశారు. 'ఇక్కడ వృథా... అక్కడ వెథ' అన్న శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. తాగునీరు వృథాగా పోకుండా ఉండేందుకు ట్యాపులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మధు మాట్లాడుతూ అవసరమైన చోట తాగునీరు పట్టుకొని ట్యాపులను కట్టివేయాలని ప్రజలకు సూచించారు.



క్రాస్ ప్రోగ్రాం వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి నాగమణి

క్రాస్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోండి

బలిజిపేట : మండలంలోని పలు గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేయడానికి శుక్రవారం నుంచి క్రాస్ ప్రోగ్రాంను ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు రవికుమార్, ఎంపిడిఒ ఎ.భానుమూర్తి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేసి, వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని మే నెల 15 వరకు కొనసాగిస్తున్నామని తెలిపారు. మండల ప్రజలకు స్థానిక బోర్లు విషయంలో ఎటువంటి సమస్య వచ్చిన ఎంపిడిఒ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. స్థానికంగా క్రాస్ ప్రోగ్రాంలో సమస్య పరిష్కారానికి ముందుండాలని మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెలది సాయిరాం, మండల అధ్యక్షులు మురళి, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వృక్షశాస్త్రం సబ్జెక్టుకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ పైల శంకర్రావు తెలిపారు. వీటికి సంబంధించి అన్ని ప్రయోగాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.


కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

కరాటేతో ఆత్మస్థైర్యం

బలిజిపేట : విద్యార్థులకు కరాటే ప్రాధాన్యత ఎంతైనా అవసరమని, ముఖ్యంగా విద్యార్థినిలకు ఆత్మస్థైర్యం నింపుకోవడానికి ఇది ఒక మార్గమని స్థానిక శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరాడ జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో గల విద్యార్థులకు వారి వారి సామర్థ్యాన్ని బట్టి కరాటే తరగతులను ఒడిశాకు చెందిన ప్రభాకర్ అనే ఉపాధ్యాయుడిచే శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పిల్లలకు మానసికంగా, ఆరోగ్యకరంగా రాబోయే రోజుల్లో మహిళలకు ఆత్మస్థైర్యం నింపేలా ఈ కరాటే క్లాసులు పనిచేస్తాయని తెలిపారు. వీటిపై శ్రీ భారతి విద్యాసంస్థలు నిరంతరం చెప్పేలా ప్రయత్నిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది వెంకట్, రామారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సాలూరు : రానున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ అమరావతి నుంచి ఆల్ డైరక్టర్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర స్థాయి వెబెక్స్ మీటింగ్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ బి.రాజకుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సమావేశంలో బుక్లెట్ విధానం, 11 పేపర్లు బదులు ఆరు పేపర్లు, రోజు తప్పించి రోజు మొట్టమొదటగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్త విధానంలో జరిగే ఈ ఏడాది ఉదయం 9.30కు ప్రారంభమయ్యే పరీక్షకు గంట ముందుగా అటెండ్ అవ్వాలని అన్నారు. అనివార్య కారణాల వల్ల ఎవరైనా అరగంట ఆలస్యమైనా పరీక్షకు అనుమతించవచ్చని చెప్పారు. పిల్లల ప్రమాణ స్థాయిలను అనుసరించి గ్రూప్‌లుగా విభజిస్తూ అత్యధిక మార్కులు, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సమావేశంలో సాలూరు రూరల్, అర్బన్ ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, జ్యోతీభాయి పూలే, మోడల్ స్కూల్ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

గ్యాస్ ధర పెంపుపై నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు మాట్లాడుతూ దేశ సంపద అయిన రైల్వే, ఓడరేవులు, గ్యాస్ ఇలా అన్ని వ్యవస్థలను అదానీకి కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ విధానాలను ఎండగట్టాలని అన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం దేశ సంపదను దోచిపెడుతున్నారని అన్నారు. గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డివిరుస్తున్న మోడీ సర్కారును గద్దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఒకపక్క నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా, మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ధరలు పెరగడం వల్ల సామాన్యులు బతకలేని పరిస్థితిని ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి స్పందించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి గ్యాస్ ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘ నాయకులు అంపోలు నారాయణరావు, ఆటో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రజనీకుమారి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గురుకుల పాఠశాల, కళాశాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి (బాలికల మాత్రమే) దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, సంబధిత ఫోన్ నెంబర్ జతచేయాలని సూచించారు. అర్హులైన విద్యార్థినిలు ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ఐదో తరగతి విద్యార్థులకు, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పరీక్షలు జరుగుతాయని, కావున ఆ రోజు దరఖాస్తు చేసుకొనే విద్యార్థినిలు హాజరు కావాలని ఆమె కోరారు. మిగిలిన వివరాల కోసం 9652144140, 8008306780, 911561365, 8008003068 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజలకు మాయమాటలు చెబుతున్న జగన్

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ప్రజలకు మాయా మాటలు చెబుతూ, తండ్రి పేరు చెప్పుకొని ఓట్లు వేయించుకొని తండ్రిని తిట్టించుకొనే పరిస్థితికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకోని వచ్చారని మాజీ మంత్రి, టిడిపి నేత పితాని సత్యనారాయణ అన్నారు. పాలకొండలో నక్కలపేటలో గల ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన టిడిపి నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్ని ఉన్నా వారి ఎజెండా ఒక్కటేనని అన్నారు. ప్రజాస్వామ్యంలో వారి పాత్ర ఎంతవరకు ఉంటుందని, వారి అలోచలనకు ప్రజలు మద్దతు పలికితే వారికీ అధికారంలోకి వస్తారన్నారు. ఎన్నికలు అయ్యాక అంత వన్‌సైడ్ యాక్షన్ అయిపోయిందని, రౌడీయిజం, పోలీసులతో అక్రమంగా కేసులు పెట్టించారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కులాలు ఎక్కువ ఉన్న అందరూ కలిసికట్టుగా ఉంటారన్నారు.ముఖ్యమంత్రి సీట్ లో కూర్చున్న వ్యక్తి కుల, భాష మాట్లాడ్డానికి లేదని, సమానత్వం మాట్లాడాల్సిన వ్యక్తి ఇవాళ కులాల పేరిట మాట్లాడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజికవర్గ ఇంఛార్జ్ నిమ్మాక జయకృష్ణ, టీడీపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్, గరుగుబిల్లి

ఆరోగ్యం పట్ల అవగాహన, ముందస్తు జాగ్రత్తల వల్ల వ్యాధులను దూరం చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అధికారి డాక్టర్ జగన్నాధరావు అన్నారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలం రావుపల్లిలో వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన సందర్శించారు. సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ముందస్తుగా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. వేసవి కాలంలో డీహైడ్రేషన్, వడదెబ్బకు గురికాకుండా నీరు, మజ్జిగ, నిమ్మరసం తరచూ తీసుకోవాలని అన్నారు. అలాగే ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఆరోగ్య కేంద్రాల్లోని, 104 వాహనాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు అందుబాటులో తాగు నీరు ఉంచుకోవాలని, వీలైనంత వరకు చల్లని ప్రదేశాల్లో ఉండాలని అన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణీలకు పాలు, గుడ్లు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందిచే హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించారు. రక్త హీనతను గుర్తించే లక్షణాలను వివరించి వీటి నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పోషకాహారం ఆవశ్యకతను వివరించి అవగాహన కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి సంబంధించిన రోగుల ఆరోగ్య తనిఖీలు, పరీక్షల రికార్డులను ఆయన పరిశీలించారు. హై రిస్క్ గర్భిణులను, కదల్లేని స్థితిలో ఉన్న రోగులను ఎప్పటికప్పుడు గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె.సాగర్ వర్మ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఈశ్వరరావు, అనీల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న డిఎంహెచ్‌ఒ జగన్నాధరావు

7న ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన 16 ద్విచక్ర వాహనాలను ఈనెల 7న వేలం వేయనున్నట్టు సిఐ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతం లో తెలియపర్చిన 9 ద్విచక్ర వాహనాలు కాకుండా ఒక ఆటోను, 12 మోటార్ బైక్‌లు, 3 మోపెడ్‌లు (టివిఎస్ ఎక్స్ ఎల్) కలిపి 16 వాహనాలను వేలం వేయనున్నట్టు తెలిపారు. కావున ఔత్సాహికదారులు ఆరోజు ఉదయం 11 గంటలకు పోలీసు స్టేషన్‌కు వచ్చి వేలంలో పాల్గొని, రవాణా శాఖ అధికారులు నిర్ణయించిన ధరకు తక్కువ కాకుండా నిబంధనల ప్రకారం వేలం పాటలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని అట్టలి, డోలమడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో డొంక త్రినాధులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించి పనులకు హాజరుకావాలని, గిట్టుబాటు కూలి వచ్చేలా పనులు చేయాలని అన్నారు. ఆయన వెంట ఇసి పద్మ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ఆయిల్ పాం సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని శ్రీ లక్ష్మీ బాలాజీ పామాయిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ ప్లాంట్ మేనేజర్ పి.రమేష్ అన్నారు. మండలంలోని చోళపదం సమీపంలో శ్రీ లక్ష్మీబాలాజీ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తూనిక కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫ్యాక్టరీ పరిధిలో గల మండలంలో 11 తూనిక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు తూనిక కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయని ఇప్పటికి రెండు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల కోసం పామాయిల్ గెలల బరువులో తగ్గుదల లేకుండా వెంట వెంటనే తూనిక వేయడం జరుగుతుందన్నారు. దీంతో రైతులకు నష్టం లేకుండా ఉంటుందని అన్నారు. ఫ్యాక్టరీకి తాజాసరుకు సరఫరా జరగడంతో పాటు రైతులకు దిగుబడి పెరిగి రవాణా ఖర్చు తగ్గి రాబడి పెరుగుతుందన్నారు. రైతులు తమ సొంత మనుషులతో సొంత బండిపై రవాణా చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ఈ తూనిక కేంద్రం ఏర్పాటు వలన త్వరగా కేంద్రం పరిధిలో గల 15 గ్రామాల్లో 50 మంది రైతులకు 350 హెక్టార్ల విస్తీర్ణంలో గల తోటలకు సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ఈ కేంద్రం పరిధిలోని చిన్న రైతులు పామాయిల్ పంట తోటలు సాగు చేయుటకు ఇది మంచి సదావకాశమని అన్నారు. రైతులు కోసిన పామ్ ఆయిల్ గెలలు వెంటనే తూనిక వేయడంతో బరువు తగ్గకుండా రైతుకు ఆదాయం సమకూరుస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో పామయిల్ సాగుకు వాతావరణం, భూమి అనుకూలంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ సాగుతో రైతులకు అధిక దిగుబడితో పాటు అధిక లాభాలు వస్తున్నాయని తెలిపారు. పామాయిల్ సాగు చేయాలని, రైతులకు అవసరమైతే సూచనలు, సలహాలు అందజేసి సహకరిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, కేంద్రం నిర్వహకులు ఉన్నారు.


కాటాను ప్రారంభిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ రమేష్

దళితవాడలో పారిశుధ్య పనులు

వీరఘట్టం : మండల కేంద్రంలోని బాబు జగజ్జీవన్‌రావు కాలనీ దళిత వీధిలో శుక్రవారం మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒ రామచంద్రరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గృహాలు ఊడ్చిన చెత్త, బల్లపై వేయాలని ప్రజలకు సూచించారు.

బుడ్డిపేటలో వైద్యశిబిరం

సీతానగరం : మండలంలోని బుడ్డిపేటలో శుక్రవారం బూర్జ పిహెచ్‌సి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మందికి పైగా రోగులను తనిఖీ చేశారు. వాత, చర్మ రోగాలు, ఆయాసం, జీర్ణ కోశ సమస్యలు, మూత్ర సంబంధిత వ్యాధులను పరీక్షించి అవసరమైన ఆయుర్వేద మందులు అందజేశారు. అలాగే వేసవి దృష్ట్యా వేసవి తాపానికి మందులు ఇచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయుర్వేద వైద్యం ఆవశ్యకతను వివరించి ప్రజలకు పలు వ్యాధులు నివారణలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. యోగా టీచర్ ద్వారా యోగా సనాలు, వాటి ఉపయోగాలు వివరించారు. మన ఇంటి పరిసరాల్లోనే లభించే కొన్ని ఆయుర్వేద ఔషధ మొక్కలపై డాక్టర్ హేమాక్షి ప్రజలకు అవగాహన కల్పించారు.

హంతకులను వెంటనే అరెస్టు చేయాలి
దళిత సంఘాల జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ

శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నీలంపేటకు చెందిన దళిత యువకుడు, అంబేద్కర్ ఇండియా మిషన్ బూర్జ మండల కన్వీనర్ జమ్మాన సుదర్శన్ రావును హత్య చేసిన హంతకులను వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘాల జెఎసి నేతలు, అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను, ఆలిండియా దళిత రైట్స్ ఫోరం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కంఠ వేణు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు బత్తిన మోహనరావు, పాలకొండ డివిజన్ అధ్యక్షులు గురుబిల్లి రవికుమార్, ఎఐఎం జిల్లా నాయకులు నాని, పెయ్యల చంటి, వన్నల లక్ష్మీనారాయణ జాషువా తదితరులు డిమాండ్ చేశారు. సుదర్శనరావు మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి రాగా, నాయకులు మృతదేహాన్ని పరిశీలించి అక్కడ ఉన్న అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేసు విచారణ అధికారైన శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వాసుదేవరెడ్డితో మాట్లాడి తక్షణమే నిందితులపై హత్య, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా నిందితుడి కుటుంబానికి ఉద్యోగం, ఆర్థిక సహాయం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వాసుదేవ రెడ్డి స్పందిస్తూ ఇప్పటికే హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులు కూడా పోలీసులు కస్టడీలోనే ఉన్నారని వారిని తప్పకుండా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు


చికిత్స పొందుతున్న రాజు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : సీతానగరం మండలం జోగింపేటకు చెందిన రాజాన రాజు వ్యసనాలకు బానిసై తాగుబోతుగా మారాడు. గత వారం రోజులుగా తాగుడు ఎక్కువగా కావడంతో భార్య లావణ్య తీవ్రంగా మందలించింది. దీంతో మనస్థాపం చెందిన రాజు ఇంట్లో ఉన్న చీమల మందు నీళ్లలో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతని పరిస్థితి గమనించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేస్తున్నారు.

వేడినీరు పడి మహిళకు గాయాలు

పార్వతీపురం రూరల్ : సీతానగరం మండలం అంటిపేటలో చర్చి వీధికి చెందిన జంబలి అనసూయ అనే మహిళ టీ కొట్టు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంది. శుక్రవారం ఉదయం తన టీ స్టాల్‌లో నీళ్లు మరుగపెడుతుండుగా పొరపాటున ఆమె మరుగుతున్న నీళ్ల పాత్ర తుల్లి పడడంతో ఒంటిపై వేడి నీళ్లు పడి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 వాహనంతో జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

10 ఎకరాల జీడి తోట దగ్ధం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కురుపాం మేజర్ పంచాయతీలో గల హుకుంపేటకు సమీపాన గల డి.సోములు, బూరిడి సూరమ్మ, రాజాపు తాతబాబు, బి.త్రినాథరావు, బండి పార్వతమ్మ తదితర రైతులకు చెందిన సుమారు పది ఎకరాలకు పైగా జీడితోటలు శుక్రవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైయ్యాయి. రైతులెవరూ అందుబాటులో లేకపోవడంతో జీడితోటల సమీపంలో ఉన్న నీలగిరి, టేకు మొక్కలు సైతం కాలిపోయాయి. పిందె వచ్చే సమయంలో ఇలా పంటకు నిప్పంటుకోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. విషయం తెలుకుని వెంటనే ఘటనా స్థలానికి ఆర్ఐ ప్రసాద్ వెళ్లి అగ్నికి ఆహుతి అయిన జీడితోటలను పరిశీలించారు.


దగ్ధమైపోతున్న జీడితోట

అదనపు వేతనాలు, అలవెన్సులు చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక ఆర్‌టిసి డిపోలో ఓటీ అమౌంట్, గ్యారేజీ అలవెన్స్, నైట్ అవుట్ అలవెన్స్ చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి దుమ్మెద గౌరీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక డిపో వద్ద శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత 6 మాసాలుగా బకాయిలు ఉన్న ఓటీ, ఇతర అలవెన్స్‌లను తక్షణమే చెల్లించాలన్నారు. ఓటీలు, ఇతర అలవెన్సు చెల్లించని పక్షంలో 8 గంట పని విధానం అమలు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ఎఎస్ ఇంక్రిమెంట్లు ఎరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. జోన్లలోనూ, డిపోల్లోనూ, జోనల్ వర్క్ షాపులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, అన్ని ఖాళీలు భర్తీ చేయాలని, ప్రమోషన్లు కల్పించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఆర్‌కె పాత్రో, సందీప్ ఆలీ, స్వరాజ్య రమణి, శంకర్, లక్ష్మి, గ్యారేజీ కార్యదర్శి రాజబాబు, అధ్యక్షులు లక్ష్మణరావు పాల్గొన్నారు.


అభ్యర్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ షన్ముఖరావు

అభ్యర్థులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

త్వరలో నిర్వహించే ఎస్ఐ రాత పరీక్షకు అభ్యర్థులు ఇప్పటి నుంచే కష్టపడి అర్హత సాధించేందుకు కృషి చేయాలని ఎల్విన్‌పేట ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.గౌరీశంకర రావు సూచించారు. స్థానిక క్రికెట్ క్రీడా మైదానంలో ఎస్ఐ ఉద్యోగ రాత పరీక్షకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. ఉద్యోగం కోసం లక్ష్య సాధనకు కృషి చేస్తే విజయం సొంతమవుతుందన్నారు. ఉద్యోగానికి అభ్యర్థులు పోటీకి ఎలా సిద్ధమవ్వాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సూచనలు అందించారు. సాయంత్రం వేళ మైదానంలో ప్రాక్టీస్ సమయంలో లైటింగ్ లేక ఇబ్బంది పడుతున్నామని అభ్యర్థులు చెప్పగానే స్పందించిన సర్పంచ్ గౌరీశంకరరావు ఎరిడి లైట్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు అభ్యర్థులంతా కచ్చితంగా విజయం సాధించాలని ఆకాంక్షించారు. అభ్యర్థులకు శిక్షణ నిమిత్తం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి వైకుంఠరావు, తదితరులు శిక్షణ ఇస్తున్నారు.

దావా సమన ప్రకటన
మహారాజశ్రీ పార్వతీపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు
O.S.No.41/2019

Between:
మండల సత్యన్నారాయణ ....వాది
And:
మండల గంగరాజు వగైరాలు ......ప్రతివాదులు

ఇందుమూలముగా తెలియజేయునది ఇందలి వాది, ప్రతివాదులపై దావా షెడ్యూల్ దాఖల ఏ బి సి ఆస్తిని మొదట రెండు భాగాలుగా విభజించి 1వ ప్రతివాది వాదికి వచ్చిన సగభాగములో 1/5వ వంతు వాదికి పంచి ఇచ్చి అతనికి స్వాధీనపరచుమని కోర్టులో వాటాలు నిమిత్తము దావా వేసినారు. 3. మండల గణేష్, 4. మండల సురేష్, 5. మండల అనీల్ ప్రతివాదులకు అనేక నోటీసులు, సమన్లు జారీచేసిన తీసుకొనుటకు ఉద్దేశపూర్వకంగా తప్పించుకుని తిరుగుచున్నందున కోర్టువారు అనుమతితో ఈ ప్రకటన సమన్లుగా భావించి **తే.13-03-2023దీ**న స్వయంగా లేదా వకీలు ద్వారా ఖుద్దున గాని హాజరై వాటాలు పంచుటకు మీయొక్క ఆక్షేపణలు, అభ్యంతరాలు తెలపగలరు. లేనియెడల మీకు పరోక్షంగా డిక్రీ జారీ కాబడును.

కోర్టు ఉత్తర్వులు మేరకు
జాగాన మధుసూదన రావు
వాది తరపు న్యాయవాది
అడ్వకేట్-పార్వతీపురం
సెల్: 9440165169